# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 14-10-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:61 పేజీలు:6 వెల: రూ.1/-


## నేడు సంపూర్ణ సూర్యగ్రహణం.. ఉంగరం ఆకృతిలో సూర్య వలయం

న్యూఢిల్లీ అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఈ నెల 14న ఏర్పడుతున్న సంపూర్ణ సూర్యగ్రహణానికి ఓ ప్రత్యేకత ఉంది. సూర్యగ్రహణం సమయంలో అత్యంత అరుదుగా ఏర్పడే 'రింగ్ ఆఫ్ ఫైర్' (ఉంగరం ఆకృతిలో సూర్య వలయం) ఆకాశంలో ఆవిష్కృతం కాబోతున్నది. ఇది అమెరికా, మెక్సికో సహా దక్షిణ, మధ్య అమెరికాలోని పలు దేశాల్లో మాత్రమే కనపడనున్నది. ఈ దేశాల్లో 'రింగ్ ఆఫ్ ఫైర్' చివరిసారి 2012లో కనిపించగా, మళ్లీ ఇప్పుడు చూడబోతున్నారు.దీని తర్వాత 2046 వరకు 'రింగ్ ఆఫ్ ఫైర్' కనిపించదని సైంటిస్టులు చెబుతున్నారు. కాగా ఈసారి సూర్యగ్రహణం భారత్ సహా అనేక దేశాల్లో కనిపించటం లేదు. 'సూర్యగ్రహణం వేళ ఏర్పడే అద్భుతమైన వలయం చూసే అవకాశం అరుదుగా వస్తుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని నాసా సైంటిస్టు పెగ్ లూసి అన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 4.30 గంటలకు అంతరిక్షంలో సంభవించే అరుదైన దృశ్యాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది.

## దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసి ప్రత్యేక బస్సు

### – ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవు:సజ్జనార్

హైదరాబాద్ అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం నుంచి ఈ నెల 25 వరకు రాష్ట్రంలో ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా 5,265 అదనపు సర్వీసులను దసరా పండుగకు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం నడుపనున్నట్లు ఆర్టీసీ వెల్లడించింది. అయితే ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని, సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని ప్రకటించింది.

## కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు పంచినా.. గెలిచేది మాత్రం బీఆర్ఎస్ పార్టీనే : మంత్రి హరీశ్‌రావు

మెదక్, అక్టోబర్ 13:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఎన్నికల్లో డబ్బు పంచి గెలించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమంగా సంపాదించిన డబ్బును తెలంగాణకు చేరవేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో జరిగిన ఐటీ దాడుల్లో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన అంబికా పతి, ఆయన భార్య అశ్వత్థ ఇంట్లో రూ. 52 కోట్లు పట్టుబడ్డాయని మంత్రి తెలిపారు.

కర్ణాటకలో గతంలో అధికారంలో ఉన్న బీజేపీ కాంట్రాక్టర్‌ల వద్ద 40 శాతం కమీషన్ వసూలు చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ 50 శాతం వసూలు చేస్తుందని మంత్రి ఆరోపించారు. ఇలా కాంగ్రెస్ పార్టీ స్కాంగ్రెస్‌గా మారిందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టికెట్‌లు అమ్ముకొంటున్నట్టు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్ని నోట్ల కట్టలు పంచినా, ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో ముచ్చటగా మూడోసారి గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే అని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

## కర్ణాటక నుంచి తెలంగాణకు భారీగా నగదును తరలించే యత్నం

### -బెంగళూరులో రూ.42 కోట్ల నగదును సీజ్

బెంగళూరు అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కర్ణాటక నుంచి భారీగా నగదును తరలించే యత్నాన్ని ఐటీ అధికారులు అడ్డుకున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో రూ.42 కోట్ల నగదును సీజ్ చేశారు. ఓ లారీలో 22 బాక్సుల్లో రూ.42 కోట్లను తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అంతేగాక ఇంతకుముందే మరో రూ.8 కోట్లను కర్ణాటక నుంచి తెలంగాణకు తరలించినట్లు అధికారులు గుర్తించారు.భారీగా నగదును సీజ్ చేసిన అనంతరం ఐటీ అధికారులు ఈ కేసును ఈడీకి బదిలీ చేశారు. కాగా బెంగళూరు నుంచి బైరే సంద్రకు లారీలో నగదును తరలించి, అక్కడి నుంచి ఏడు కార్లలో తెలంగాణకు తరలించాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలిపారు. అంతేగాక బెంగళూరులో మరో 5 చోట్ల ఐటీ అధికారులు తనిఖీలు చేశారు.కాంట్రాక్టర్ అంబికాపతి ఇల్లు, గెస్ట్‌హౌస్, ఆఫీస్‌లలో తనిఖీలు నిర్వహించారు. తెలంగాణలోని ఓ పార్టీ ఎన్నికల ఖర్చుల కోసం ఈ నగదును తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.


ఆహ్వానం! స్వాగతం!!

విశాలాక్షి వృద్ధుల ఆశ్రమం & విశాలాక్షి సాహిత్య మాసపత్రిక

వార్షికోత్సవ సంబరాలు

కథ, కవిత, మినీ కథ, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం

గౌరవ అతిథి : శ్రీ కాకాణి గోవర్ధన రెడ్డి గారు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామాత్యులు

సభాధ్యక్షులు : శ్రీ అమరావతి కృష్ణారెడ్డి గారు, 25 కళా సంఘాల అధ్యక్షులు

విశిష్ట అతిథి : శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు గారు, పూర్వ ఐఏఎస్ & ప్రముఖ సాహితీ వేత్త

ఆత్మీయ అతిథి : శ్రీ ఎమ్వీ రామిరెడ్డి గారు, ప్రముఖ రచయిత

విశాలాక్షి పురస్కార గ్రహీతలు : డా॥ పాలంకి రాధిక, M.A., Ph.D., వి.ఆర్. కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపాల్; శ్రీ చలంచర్ల భాస్కర రెడ్డి, తెలుగు భాషోద్యమ నాయకులు

వేదిక : టౌనుహాలు, మిద్దెపైన A.C. హాలు, నెల్లూరు. తేది 29-10-2023 ఆదివారం సా॥ గం॥ 6.05 నిలకు

మామిడిపూడి రామకృష్ణయ్య గారి స్మారకంగా వెలువడుతున్న విశాలాక్షి విరజాజులు కార్టూన్ల సంకలనం ఆవిష్కరణ జరుగుతుంది

కోసూరు రత్నం, నిర్వాహకులు, పబ్లిషర్ — ఈతకోట సుబ్బారావు, సంపాదకులు


నేటి కందం– నేటికి అందం

కం॥ అంబేద్కరు ఓ దినమున
[illegible]
[illegible]
[illegible]



( 14-10-1956 అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించిన రోజు..)

-రాధశ్రీ
సెల్:9494481210

## మంత్రి వేముల మాతృమూర్తి మంజులమ్మ భౌతిక కాయానికి సీఎం కేసీఆర్ నివాళులు



హైదరాబాద్, అక్టోబర్ 13:: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ భౌతిక కాయానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నివాళులర్పించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూరులోని మంత్రి నివాసానికి వెళ్లి మంజులమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మంత్రి వేములను, ఆయన కుటుంబసభ్యులను సీఎం పరామర్శించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వెంట స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాగా, మంజులమ్మ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు సీఎం కేసీఆర్ ఇవాళ ఉదయం ప్రగతిభవన్ నుంచి వేల్పూర్‌కు చేరుకున్నారు. మంత్రి వేముల మాతృమూర్తి మంజులమ్మ (77) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. మంజులమ్మకు గతంలో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ జరిగింది. ఆ తర్వాత కోలుకున్నప్పటికీ మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో మృతిచెందారు.

## 40 చోట్ల అభ్యర్థులే లేని కాంగ్రెస్.. 70 చోట్ల ఎలా గెలుస్తుంది..? : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 13: తెలంగాణలో 40 చోట్ల అభ్యర్థులే లేని కాంగ్రెస్.. 70 చోట్ల గెలుస్తామని ఆ పార్టీ నాయకులు ఎలా చెబుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. డబ్బులు ఇచ్చిన వారికే కాంగ్రెస్ టికెట్లు దక్కుతున్నాయి. కూకట్‌పల్లి సీటు కోసం రూ. 15 కోట్లు అడిగారని ఓ కాంగ్రెస్ నేత చెప్పారు.

నేను చెప్పినట్టే కర్ణాటకలో అక్రమ డబ్బు జమ అవుతోంది. ఇప్పటికే రూ. 8 కోట్లు కొడంగల్ చేరినట్టు సమాచారం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

### 100 నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రచారం..

కేసీఆర్ వంద నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తారని కేటీఆర్ తెలిపారు. జీహెచ్ఎంసీ, సిరిసిల్ల, కామారెడ్డిలో నేను ప్రచారం చేస్తాను. ఎన్నికల నిర్వహణలో ఈసీ స్వతంత్రంగా పని చేస్తుందని భావిస్తున్నా. అధికారుల బదిలీలను సాధారణ బదిలీలుగానే చూస్తాం. హుజురాబాద్‌లో కూడా మేమే గెలుస్తాం. ఈటల రాజేందర్ 50 చోట్ల పోటీ చేసినా, షర్మిల 119 సీట్లలో పోటీ చేసినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

### పొన్నాల బీఆర్ఎస్‌లో చేరుతానంటే రేపే వెళ్లి ఆహ్వానిస్తా..

రాహుల్ గాంధీ లీడర్ కాదు.. రీడర్ అని కేటీఆర్ విమర్శించారు. పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరుతానంటే రేపే వెళ్లి ఆహ్వానిస్తాను. త్వరలో చాలా మంది ప్రముఖులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత గాంధీ భవన్‌లో తన్నుకుంటారు. కాంగ్రెస్‌లో సీఎం పదవికి ఇద్దరి మధ్య అంగీకారం కుదిరినట్టు సమాచారం ఉందన్నారు.

### బీజేపీ 110 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడం ఖాయం..

అమిత్ షా అబద్ధాలకు హద్దే లేదని కేటీఆర్ మండిపడ్డారు. బీజేపీని వారి నాయకత్వమే సీరియస్‌గా తీసుకోవడం లేదు. బీజేపీ 110 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడం ఖాయం. బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుంది. బీజేపీతో



స్నేహముంటే మోదీని ఎందుకు తిడుతాం. వేం ప్రతీకార రాజకీయాలు చేయడం లేదు. రేవంత్ అక్రమాలపై ఐటీ, ఈడీ సోదాలు ఎందుకు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.

### లోకేష్ ట్వీట్ బాధ కలిగించింది..

చంద్రబాబు ఆరోగ్యంపై లోకేష్ ట్వీట్ బాధ కలిగించిందని కేటీఆర్ పేర్కొన్నారు. కుమారుడిగా తండ్రి ఆరోగ్యంపై ఆందోళన ఎలా ఉంటుందో తెలుసు. కేసీఆర్ నిరాహార దీక్ష సమయంలో నాకూ ఆందోళన కలిగింది. హైదరాబాద్ ప్రశాంతంగా ఉండాలనే ఇక్కడ ఆందోళనలు వద్దంటున్నాం అని కేటీఆర్ తెలిపారు.

## గాజాపై కురిసిన 6వేల బాంబులు.. వైట్ పాస్ఫరస్‌తోనూ అటాక్ !



జెరుసలాం అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాకెట్లతో హమాస్ దాడి చేసిన నేపథ్యంలో.. ఇజ్రాయిల్ కౌంటర్ అటాక్మొదలు పెట్టిన విషయం తెలిసిందే. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు చేసింది. అయితే గత శనివారం నుంచి జరుగుతున్న దాడుల్లో సుమారు ఆరు వేల బాంబులను వాడినట్లు తెలుస్తోంది. కేవలం గాజాపైనే ఆరు వేల బాంబులు వేసినట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఆ బాంబులు దాదాపు 4వేల టన్నులు ఉన్నట్లు తెలుస్తోంది. గాజాలో ఉన్న హమాస్ ప్రాంతాలపై బాంబులతో ఇజ్రాయిల్ టార్గెట్ చేసింది. తమ వైమానిక దళం సుమారు 3600 టార్గెట్లను అటాక్ చేసినట్లు ఇజ్రాయిల్ వైమానిక దళం పేర్కొన్నది.హమాస్ ఆకస్మిక దాడులకు కౌంటర్ అటాక్ ప్రారంభించిన ఇజ్రాయిల్ వైఖరిపై మానవహక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. తమ దాడుల కోసం ఆ దేశం వైట్ పాస్పరస్‌ను వాడినట్లు భావిస్తున్నారు. వివాదాస్పద వైట్ పాస్పరస్ మందును.. గాజా స్ట్రిప్‌తో పాటు లెబనాన్‌లో ఉన్న టార్గెట్లపై వాడినట్లు తెలుస్తోంది. చాలా వేగంగా అంటుకునే గుణం ఉన్న ఆ రసాయనాన్ని.. సాధారణంగా మిలిటరీ వాడుతుంది. వైట్ పాస్పరస్ వల్ల శరీరం కాలిపోయే ప్రమాదం ఉంటుంది. ఆయుధంగా ఆ రసాయనాన్ని వాడితే ప్రమాదాలు తీవ్రంగా ఉంటాయి. జన సాంద్రత ఉన్న ప్రదేశాల్లో ఆ రసాయనాన్ని ఎక్కువగా వాడుతుంటారు. వైట్ పాస్పరస్ వాడడం లేదని ఇజ్రాయిల్ పేర్కొన్నా.. కొన్ని వార్తా సంస్థలు తీసిన ఫోటోల్లో ఆ రసాయనాన్ని వాడినట్లు అర్థమవుతోంది.గాజా, లెబనాన్‌లో వైట్ పాస్పరస్‌కు చెందిన బాంబులు పేలినట్లు ఉన్న కొన్ని ఫోటోలను మానవ హక్కుల సంస్థ రిలీజ్ చేసింది. ఆకాశంలో ఏర్పడిన తెల్ల మబ్బులకు చెందిన ఫోటోల ఆధారంగా వైట్ పాస్పరస్ రసాయనంతో దాడి జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఆక్సిజన్‌తో కలిసినప్పుడు వైట్ పాస్పరస్ మండుతుంది. ఆ మంటతో తెల్ల పొగ కమ్ముకుంటుంది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఆ రసాయనాన్ని బ్యాన్ చేయలేదు. కానీ ఆ రసాయనం వల్ల మనుషులకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. గతంలో స్మోక్ అటాక్ కోసం వైట్ పాస్పరస్‌ను ఇజ్రాయిల్ వాడింది.

## గాజాపై ఇజ్రాయెల్ బాంబు దాడులు ఆపకపోతే ఇతర సరిహద్దుల్లో యుద్ధం-ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్ అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: గాజాపై ఇజ్రాయెల్ బాంబు దాడులు ఆపకపోతే ఇతర సరిహద్దుల్లో యుద్ధం మొదలు కావచ్చని ఇరాన్ హెచ్చరించింది. లెబనాన్‌కు చెందిన హిబ్జుల్లా ఇజ్రాయెల్‌పై దాడులకు సిద్ధంగా ఉందన్న సంకేతం ఇచ్చింది. ఇరాన్ విదేశాంగ మంత్రి హ్పొస్సేన్ అమిరాబ్‌డొల్లాహియాన్ గురువారం సాయంత్రం బీరూట్‌కు చేరుకున్నారు. అక్కడ హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ ప్రతినిధులు, లెబనీస్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గాజాపై ఇజ్రాయెల్ దూకుడు, యుద్ధ నేరాలకు పాల్పడటం, ముట్టడి నేపథ్యంలో ఇతర సరిహద్దుల వద్ద వాస్తవ యుద్ధానికి దారి తీయవచ్చని అన్నారు.కాగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హ్పొస్సేన్ అమిరాబ్‌డొల్లాహియాన్ గురువారం తెల్లవారుజామున ఇరాక్‌ను సందర్శించారు. ఆ దేశ ప్రధాని మొహమ్మద్ షియా అల్–సుడానీతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన అక్కడ కూడా ఇలాంటి ప్రకటన చేశారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపకపోతే ఆ దేశ ఇతర సరిహద్దుల్లో యుద్ధం ఆరంభమవుతుందని హెచ్చరించారు. మరోవైపు గాజాలోని హమాస్‌కు, లెబనాన్‌లోని హిజ్బుల్లాకు ఇరాన్ మద్దతిస్తున్నది. అయితే ఇజ్రాయెల్‌పై హమాస్ దాడుల వెనుక ఇరాన్ ప్రమేయంపై ఎలాంటి స్పష్టత లేదు.



## ఎన్నికల నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు : మంత్రి తలసాని



హైదరాబాద్, అక్టోబర్ 13(నేటినిజం ప్రతినిధి) ఎన్నికల నిబంధనల పేరుతో అధికారులు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం సరి కాదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్(శుక్రవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంలో తప్పులేదు. కానీ, నిబంధనల పేరు చెప్పి వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు.

నగరానికి చెందిన స్వర్ణ కారులే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడి వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారి పట్ల నిబంధనల వంకతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో వ్యాపారులు ఎంతో ఆందోళన, ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయకుండా వ్యవహరించాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ కోరారు.

## ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీకి సంబంధించి ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసీ ఆదేశాలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్ సీపీ మినహా అన్ని పోస్టులకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రం పంపిన ప్యానల్ నుంచి అధికారులను ఈసీ ఎంపిక చేసింది.యాదాద్రి కలెక్టర్‌గా హనుమంత్, నిర్మల్ కలెక్టర్‌గా ఆశీష్ సంగ్వాన్, రంగారెడ్డి కలెక్టర్‌గా భారతీ హోలీకేరి, మేడ్చల్ కలెక్టర్‌గా గౌతం, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీ ప్రసాద్, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శిగా సునీల్ శర్మ, ఎక్సైజ్ కమిషనర్‌గా జ్యోతి బుద్ధ ప్రకాశ్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా క్రిస్టినా నియామకం అయ్యారు.

### పోలీసు కమిషనర్లు, ఎస్పీల జాబితా..

1. అంబర్ కిషోర్ ఝా – వరంగల్ పోలీసు కమిషనర్
2. కల్మేశ్వర్ సింగేనేవర్ – నిజామాబాద్ పోలీసు కమిషనర్
3. చెన్నూరి రూపేశ్ – సంగారెడ్డి ఎస్పీ
4. సింధూ శర్మ – కామారెడ్డి ఎస్పీ
5. సంప్రీత్ సింగ్ – జగిత్యాల ఎస్పీ
6. హర్షవర్ధన్ – మహబూబ్‌నగర్ ఎస్పీ
7. వైభవ్ రఘునాథ్ – నాగర్‌కర్నూల్ ఎస్పీ
8. రితిరాజ్ – జోగులాంబ గద్వాల్ ఎస్పీ
9. పాటిల్ సంగ్రామ్ సింగ్ గణపతి రావ్ – మహబూబాబాద్ ఎస్పీ
10. యోగేష్ గౌతమ్ – నారాయణపేట ఎస్పీ
11. కిరణ్ ప్రభాకర్ – భూపాలపల్లి ఎస్పీ
12. రాహుల్ హెగ్డే – సూర్యాపేట ఎస్పీ


ఆహ్వానం

హస్మిత ప్రచురణలు – హైద్రాబాద్

'స్వయంసిద్ధ' సమాలోచన సదస్సు - 2023

16 అక్టోబర్ 2023, ఉ॥ 10 గం॥ నుండి సా॥ 5-30 గం॥ వరకు

కాన్ఫరెన్స్‌హాలు, రవీంద్రభారతి, హైదరాబాదు

ప్రారంభ సభ & మొదటి సెషన్

ఉ॥ 10 గం॥ నుండి 2 గం॥ వరకు

నిర్వహణ, స్వాగతోపన్యాసం : విజయ భండారు

అభినందన సందేశం : మామిడి హరికృష్ణ

స్వయంసిద్ధ రచయితల పరిచయం – అనుభవాలు

స్వయంసిద్ధ విజయోత్సవ స్పందనలు – జ్ఞాపకాలు (పవర్ పాయింట్ ప్రెజెంటేషన్)

11-45 గం॥కు 'టీ' విరామం

మ॥ 12 గం॥ – 2 గం॥ వరకు

మలి సంకలన విషయ చర్చ

మాతృత్వం - కుల, మత, సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాలు

వక్తలు : ఓల్గా, కొండేపూడి నిర్మల, కవిత పులి, సుల్తాన – షాహీన్

మ॥ 2 గం॥కు భోజన విరామం

మ॥ 3 గం॥ – 5 గం॥ వరకు

రెండవ సెషన్

కథా రచన – వివిధ అంశాలు

నిర్వహణ : పి. జ్యోతి

కథా రచన – వస్తువు – శైలి, శిల్పం : డా॥ భారతి (గీతాంజలి)

కథా రచన – భాష, యాస, ప్రాంతీయత : డా॥ గోగు శ్యామల

కథా రచన – ఆధునిక మహిళల దృక్కోణాలు : మానస ఎండ్లూరి

సా॥ 5 గం॥ నుండి 5-30 వరకు

ప్రశ్నలు – జవాబులు

నిర్వహణ, వందన సమర్పణ : పి. జ్యోతి

# అర్హతకు మించి ఆశపడితే అపజయం వెక్కిరిస్తుంది?!

## (డెన్నిస్ ప్రాగర్ విశ్లేషించిన 'మిస్సింగ్ టైల్స్ సిండ్రోమ్' ఆధారంగా)

మన జీవితాలు భగవంతుడు ప్రసాదించిన అద్భుత వరాలే. ఒకే చిన్న గదిలో జీవించే వ్యక్తులు అమితానంద డోలికల్లో తేలియాడుతుంటారు. అత్యంత ధనవంతుల్లో ఆనందానికి దూరంగా నిద్రలేమితో భారంగా గడుపుతున్న బతుకులు. నా మిత్రుడికి ఖరీదైన ఆపిల్ ఫోన్ ఉంది, నా వద్ద చవకైన డబ్బా ఫోన్ మాత్రమే ఉంది. మా బంధువుకు పెద్ద బంగళా ఉంది, మాది రెండు గదుల పెంకుటిల్లు మాత్రమే. నా స్నేహితుడు నిత్యం ఖరీదైన డ్రెస్సులు వేస్తాడు, నా వద్ద అతుకుల బట్టలే ఉన్నాయి. ఇలాంటి విపరీతమైన అసమంజస ఆలోచనలు మన మనసును అనునిత్యం చెదలు వలె తొలుస్తున్నాయి.

### ఆనందంగా జీవించడం ఓ అద్భుత కళ:

ఆనందంగా జీవించమనేది ఓ అద్భుత కళ. మన సామర్థ్యాలు, నైపుణ్యాలకు పదును పెడుతూ, లక్ష్యాలను ఛేదిస్తూ సుఖ సంతోషాల దుప్పట్లు కప్పుకొని జీవితాన్ని ఆస్వాదించడానికి అడుగులు వేయాలి. మనకు ఉన్న దానితో తృప్తి పడని కలికాలం నడుస్తోంది. ఆకాశానికి నిచ్చెన వేయడం, అర్హతకు మించి అత్యాశ పడడం, గోరంత శ్రమ చేసి కొండంత ఆశించడం పరిపాటైంది. అసాధ్యమని తెలిసి విఫలయత్నం చేయడమే జీవిత పరమార్థం అని అనుకుంటున్నాం. మనకు అందుబాటులో ఉన్న వస్తువులు, సౌకర్యాలు, వనరులతో తృప్తి చెందక, లేని దాని కోసం దురాశతో అర్రులు చాస్తూ సంతోషమయ జీవితాలను దుఃఖ సంద్రంలో ముంచేస్తున్నాం. అర్హత లేని దాని కోసం తపిస్తూ, చేతుల్లో/మనసుల్లో ఉన్న ఆనంద నిధులు మరిచి గంపెడంత దిగులును మోస్తున్నాం. మన చుట్టు ఉన్న సౌకర్యాలను, వనరులను, ఆస్తులను ఆనందంగా అనుభవించుట మరిచిన నవ్య డిజిటల్ మనిషి లేని దాని కోసం తలచి, వగచి, చింతిస్తూ విఫలయత్నం చేసి, అపజయం మూటకట్టుకొని బతుకులను నిరాశల ఊబీలోకి ఈడ్చుతున్నాం.

మిస్సింగ్ టైల్స్ సిండ్రోమ్:

మనకు ఎన్నో కోరికలు ఉంటాయి, కొన్ని మాత్రమే సాకారమవుతాయి. మనకు అసాధ్యమయ్యే కోరికలను మదిలో తలచి మనసులో ఉన్న సంతోష క్షణాలను వృథా చేసుకుంటున్నాం. ఆనందానికి అంతు లేదు, దురాశకు మించిన రోగం లేదు. సంతృప్తికి మించిన సంపద లేదు. ఎవరి జీవితం పరిపూర్ణం కాదు. పరిపూర్ణత (ఫర్‌ఫెక్షన్) సాధించడానికి చేసే ప్రయత్నంలో మనిషి ఉత్తమ స్థితికి(ఎక్సలెన్స్) చేరుకుంటాడు. కొందరు ప్రదర్శించే విపరీత మనో వికల స్థితిని 'డెన్నిస్ ప్రాగర్' విశ్లేషిస్తూ, మనకు ఉన్న దానితో సంతృప్తి చెందడం మరిచిన మానవుడు, తనది కానిది, తనకు లేనిది, తన అర్హతకు తగని దాని కోసం దురాశ పడుతూ నీరసం, నిరాశలను అనుభవించడాన్ని "మిస్సింగ్ టైల్ సిండ్రోమ్" అని నామకరణం చేశాడు. సిండ్రోమ్ అనగా బహువ్యాధి లక్షణం. మనది కానిది, మనకు లేని దాని కోసం కాలయాపన చేస్తున్న మనుషులు ఉన్న వాటిలో సంతోష క్షణాలను వెతుక్కోవడం మరిచి పోతున్నారు.

### అర్హతకు మించిన ఆశలే దుఃఖహేతువులు:

ఒక అత్యద్భుత రాజ మందిరంలోకి తొలిసారి అడుగిడిన సామాన్యుడు ఆ మందిరంలోని తళతళ మెరిసే ఫర్నీచర్, సోఫాలు, గోడలపై అందమైన పేయింటింగ్‌లు/పోస్టర్లు, పై కప్పుకు వేళాడుతున్న షాండ్లియర్స్, ఖరీదైన కర్టెన్ల కదలికలు, ధగధగ మెరిసే విధ్యుత్ దీపాలు, పై కప్పున అతికించిన అందమైన ఇటాలియన్ మెసాయిక్ టైల్స్ లాంటి అందాల విందులను ఆరగిస్తూ అమితానందంలో మునిగి తేలుతుంటాడు. పై కప్పుకు అలంకరించిన వేల టైల్స్ అందాలను చూస్తూనే, నిర్మించిన శ్రామికుడి కళను చూసి మనసులోనే ఆనందపారవశ్యంతో మునిగి పోతాడు. ఆ సువిశాల అందాల మేడ పై కప్పును అన్ని వైపులా చూస్తున్న ఆ వ్యక్తి ఓ మూలన ఒక టైల్ మిస్సైనట్లు గమనించిన మరు క్షణమే తన ముఖంలో ఆనందం మాయమై నిరుత్సాహ మురుగులో పడిపోతాడు. అందంగా అమర్చిన వేల టైల్స్‌ను చూస్తూ ఆనందపడక, పై కప్పులో మిస్సైన ఒక్క టైల్ స్థానాన్ని చూసి నిరాశ పడడం విచిత్రంగా తోస్తున్నది. ఇలా మన జీవితాల్లో కూడా మనకు దేవుడు ప్రసాదించిన పలు సౌకర్యాలతో తృప్తి పడుతూ ఆనంద పడడం నేర్చుకోవడానికి బదులు, అందుబాటులో లేని, ప్రయత్నించినా దొరకని వనరులను తలచుకుంటూ మన బతుకుల్ని చీకటిమయం చేసుకుంటున్నాం.

### మిస్సింగ్ టైల్స్ సిండ్రోమ్ అవలక్షణాలు :

మన దగ్గర లేనివి, మన అర్హతకు మించిన వాటి కోసం నిరంతరం దురాశ పడుతూ, విఫలయత్నం చేస్తూ జీవితాలను నరకప్రాయం చేసుకునే వ్యక్తులను పలు శారీరక, మానసిక అనారోగ్య లక్షణాలు వేదిస్తాయి. అసంతృప్తి, సంతోష లేమి, ఆందోళన, పశ్చాత్తాపపడం, నిస్సహాయత, ఆత్మన్యూనత, విచారం, నిరాశ, నీరసం, కృతజ్ఞత లేకపోవడం లాంటి అవలక్షణాలు కనిపిస్తూ ఆరోగ్యాన్ని హరిస్తుంటాయి.

### మిస్సింగ్ టైల్ సిండ్రోమ్ నుంచి బయటపడే మార్గాలు:

భగవంతుడు అందించిన వనరులతో తృప్తి పడుతూ కృతజ్ఞతాపూర్వకంగా ఉండే వారిలో ఆనందం వెల్లివిరుస్తుంది. అనుకున్నవి అన్ని జరగవని, జరిగేవన్నీ మంచికని, ప్రాప్తమైనవే మనకు దక్కుతాయని సంతృప్తి చెందడమే విజ్ఞుల పని అని గమనించాలి. మనకు ఉన్న దానితో సంతృప్తి పడడం ఉత్తమమైన, సంతోషకరమయిన జీవన మార్గం అని తెలుసుకుందాం. అన్ని నాకే కావాలనే ఆలోచన అనారోగ్య కారకమని తెలుసుకోవాలి. అత్యాశ అనర్థదాయకం. దురాశ చెదలు వలె మన శరీరంపై దాడి చేస్తుంది. ఇతరులను చూసి ఈర్ష్య పడడం అర్థరహితం, అవాంఛనీయం. ఇలాంటి ప్రతికూల ప్రవర్తనతో నిరాశ ఆవహించిన బతుకుల్లో ఆనందం అదృశ్యం అవుతుంది. ఆనందమే ఆరోగ్యం, ఆరోగ్యమే మహాభాగ్యం. ఆశావహ దృక్పథమే ఆనందానికి హేతువు. నాకు లేదనే నిరాశ ముదిరితే దొందతనాలు, దోపిడీలు, హత్యలకు కూడా దారి తీయవచ్చు. మనది కానిది, మనకు లేని దాని గూర్చి మరిచిపోదాం. మనకు లేని దాని కోసం ప్రయత్నం చేయడం సహజ మానవ ధర్మం. ఈ ప్రయత్నం విజయవంతం అయితే సంతోషం, విఫలమైతే పట్టుదల పెంచుకొని మరో మార్గాన్ని వెతుకుదాం. మనకు అసాధ్యమైన దాని కోసం సమయం వెచ్చించడం అవివేకం. మనకు లేని దానికి ప్రత్యామ్నాయాన్ని అణ్వేషిద్దాం. సాధ్యంకాని వాటిని మరిచి పోవడం ఉత్తమం.

మన ముందు అందుబాటులో ఉన్న వాటితో ప్రేమగా, ఆనందంగా జీవించడమే ఉత్తమ మనిషి పని. కృతజ్ఞత భావమే ఆనంద రహస్యం. ఆనందంగా ఉండే వారందరూ కృతజ్ఞత గుణంతో ఉంటారు. కృతఘ్నులు సాధారణంగా ఆనందాన్ని కోల్పోతూ నిరాశల తుఫానులో కొట్టుకుపోతారు. ఆనందమయ జీవితానికి అడ్డుగా నిలుస్తున్న మిస్సింగ్ టైల్(లేని సౌకర్యం)ను గమనించి దూరంగా ఉందాం. మన ముందున్న అనేక టైల్స్(వనరులు/వసతులు/వస్తువు)ను చూస్తూ, అనుభవిస్తూ సంతోష సాగరంలో ఈదుదాం. మనకు దేవుడు ప్రసాదించిన వనరులతో సంతృప్తికరంగా, కృతజ్ఞతాపూర్వకంగా జీవిద్దాం. మన వద్ద లేని దాని కోసం వెంపర్లాడవద్దు. ఆనందాన్ని వస్తువులో వెతక వద్దు, మనసులో దాచుకుందాం. సుఖంగా ఉన్న వారందరూ సంతోషంగా లేరని, ఆనందంగా ఉండే వారు గుడిసెలోనైనా సుఖంగా నిద్రిస్తారని మరువరాదు. మనకు లేని వనరుల కోసం అత్యాశ పడితే ఆనందం హరిస్తుంది. మన చేతుల్లో ఉన్నదే మన సంతోష కారణం కావాలని కోరుకుందాం, ఆనంద డోలికల్లో విహరిద్దాం, సుఖసంతోషాల ఊయల్లో తేలియాడుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

## – కాంగ్రెస్ నేత పరికపల్లిశ్రీనివాస్

ఖమ్మం, అక్టోబర్ 13:(నేటినిజం ప్రతినిధి): గత ఎన్నికల



మ్యానిఫెస్టోలో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ విఫలమ య్యాడని, మరల ఓట్లు అడగడానికి వచ్చే బీఆర్ఎస్ నాయకులను తరిమి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ కొనిజర్ల మండల నాయకులు పెద్దమునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2018 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీ రైతు రుణమాఫీ చేస్తామని, ఎరువులు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన ఇప్పటి వరకు 10 శాతం మాత్రమే రైతులకు రుణమాఫీ జరిగిందని, మిగతా 90 శాతం రైతులకు రుణమాఫీ అమలు కాలేదన్నారు. గతంలో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చిన దాఖలాలులేవన్నారు.

రాబోయే ఎన్నికలలో రైతులను ఓట్లు అడగానికి వచ్చే బీఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

# అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ఆదిలాబాద్, అక్టోబర్ 13:ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లాలో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇవాళ ఉదయం 11:30 గంటలకు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో గల అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ అయిన ఘన్ పూర్ చెక్ పోస్ట్ ను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు.

అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రత్యేక పోలీసు నిఘాను ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనా లన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎస్పీ వెంట బోథ్ సీఐ భీమేష్, ఎస్సై రాము ఉన్నారు.

# చంద్రబాబు ఆరోగ్యంపై కుటుంబ సభ్యుల ఆందోళన- అత్యవసర వైద్య సేవలందించాలని డిమాండ్

అమరావతి, అక్టోబర్ 13: ప్రస్తుతం రాజమండ్రి జైలులో ఉన్న టిడిపి అధినేత , భర్త చంద్రబాబునాయుడు ఆరోగ్యంపై నారా భువనేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. చంద్రబాబు ఇప్పటికే ఐదు కిలోల బరువు తగ్గారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఆయన బరువు తగ్గితే అది కిడ్నీలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండడంతో చంద్రబాబు ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఈ భయంకరమైన పరిస్థితులు తన భర్త జీవితానికి తక్షణ ముప్పు సృష్టించేలా ఉన్నాయని భువనేశ్వరి ఎక్స్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు.



చంద్రబాబు ఆరోగ్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, నారా బ్రాహ్మణి నేడు ట్విట్టర్ లో ఓ పోస్ట్ పెట్టారు. "గుండె తరుక్కుపోతోంది. నారా చంద్రబాబు నాయుడు గారు ప్రస్తుతం తగిన సదుపాయాల్లేని, అపరిశుభ్ర కారాగార పరిస్థితుల మధ్య నిర్బంధంలో ఉన్నారు. అది ఆయన ఆరోగ్యానికి ఆందోళనకర రిస్క్ ను తీసుకొస్తుంది. వైద్య నిపుణులు ఆయన ఆరోగ్యం పట్ల ఆందోళనలు వ్యక్తం చేసినందున అత్యవసర వైద్య పర్యవేక్షణ అవసరం ఇప్పుడు ఏర్పడింది. సకాలంలో వైద్య సంరక్షణ అందించడం లేదు. ఆయన 5 కిలోల మేర బరువు తగ్గారు. మరింత బరువు తగ్గితే అది కిడ్నీలపై ప్రభావం చూపిస్తుంది. ఆయన ఆందోళన గురించి మేము ఎంతో ఆందోళన చెందుతున్నాం" అని బ్రాహ్మణి తన పోస్ట్ లో పేర్కొన్నారు.

చంద్రబాబుకు ఏదైన జరిగితే పూర్తి బాధ్యత జగన్ దే ..

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు ఆరోగ్యంపై టీడీపీ నేత యనమల రామకృష్ణుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు ఏదైనా జరిగితే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. చంద్ర బాబుకు తక్షణం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యం అందించాలని కోరారు. ఆయనకు పూర్తిస్థాయిలో వైద్యం చేయడం తోపాటు సరైన వైద్యం అందించాలని యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు.

# నార్థ్ ఈస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు బోగీలు కొన్ని పట్టాలు తప్పిన ఘటన లో ప్రాణనష్టం వాటిల్లినందుకు సంతాపాన్ని తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:నార్థ్ ఈస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు బోగీల లో కొన్ని రైలు బోగీలు పట్టాలు తప్పిన ఘటన లో ప్రాణనష్టం వాటిల్లినందుకు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాధితుల కు అధికార యంత్రాంగం చేతనైన అన్ని విధాలు గాను సహాయాన్ని అందిస్తోందని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు."నార్థ్ ఈస్ట్ ఎక్స్ ప్రెస్ కు చెందిన కొన్ని రైలు బోగీలు పట్టాలు తప్పినందువల్ల ప్రాణనష్టం జరిగిందని తెలిసి బాధపడ్డాను. ప్రియతముల ను కోల్పోయిన కుటుంబాల కు ఇదే నా సంతాపం. ఈ దుర్ఘటన లో గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆ ఈశ్వరుడిని ప్రార్థిస్తున్నాను. బాధితుల కు అందరి కీ చేతనైన అన్ని విధాలు గాను అధికారులు సహాయాన్ని అందజేస్తున్నారు: ప్రధాన మంత్రి" అని తెలిపింది.

# సైన్యం, బిఆర్ఒ ఇంకా ఐటిబిపిలకు చెందిన అంకితభావం కలిగిన సిబ్బందితో ఉత్తరాఖండ్‌లోని పార్వతి కుండ్ మరియు గుంజిలలో భేటీ అయిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:సైన్యం, బిఆర్ఒ, ఇంకా ఐటిబిపి లకు చెందిన అంకితభావం కలిగిన సిబ్బంది తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉత్తరాఖండ్ లోని పార్వతి కుండ్ మరియు గుంజి లలో బేటీ అయ్యి వారి తో మాట్లాడారు. వారి యొక్క ఉత్సాహం మరియు వారి యొక్క సమర్పణ భావం యావత్తు దేశ ప్రజల కు ప్రేరణ ను అందిస్తున్నాయని శ్రీ నరేంద్ర్ మోదీ స్పష్టంచేశారు.

"పార్వతి కుండ్ లోను, గుంజి లోను సైన్యం, బిఆర్ఒ, ఇంకా ఐటిబిపి లకు చెందిన అంకిత భావం కలిగిన సిబ్బంది తో భేటీ అయ్యాను. సవాళ్ల తో కూడుకొన్నటువంటి స్థితుల లో వారి యొక్క అచంచల సేవ నిజంగా ప్రశంసనీయం. వారి ఉత్సాహం మరియు సమర్పణ భావం యావత్తు దేశ ప్రజల కు ప్రేరణ ను అందిస్తున్నాయి." అని పేర్కొన్నారు.

# హెల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో ఉచిత వైద్య శిభిరం



మేడ్చల్ అక్టోబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హెల్ టాటా మణి ఛారిట బుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో గురువారం మేడ్చల్ లోని భారత్ బైబిల్ కాలేజ్ లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రజలకు బిపి,షుగర్, తైరాడ్,హార్ట్,డెంటల్, కంటి పరీక్షలతో పాటు మొత్తం 10 విభాగాలకు వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా తగు సూచనలు, మందులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్త దాన శిబిరం లో 40 మంది తమ రక్తాన్ని దానం చేసారు.

ఈ వైద్య శిబిరం లో వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ జ్యోతి కాకుమాను స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# తొమ్మిదో జి20 పార్లమెంటరీ స్పీకర్స్ సమిట్ (పి20)ని ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తొమ్మిదో జి20 పార్లమెంటరీ స్పీకర్స్ సమిట్ (పి20) ని 2023 అక్టోబరు 13 వ తేదీ నాడు ఉదయం పూట సుమారు 11 గంటల వేళ లో న్యూ ఢిల్లీ లోని యశోభూమి లో ప్రారంభించనున్నారు. భారతదేశం జి20 కి భారతదేశం అధ్యక్షత ను వహిస్తూ ఉండగా భారతదేశం పార్లమెంటు ఈ శిఖర సమ్మేళనాన్ని ఏర్పాటు చేసింది.

జి20 కి భారతదేశం అధ్యక్షత వహిస్తూ ఉన్న తరుణం లో ఎంచుకొన్న ఇతివృత్తానికి అనుగుణం గా 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు లకై పార్లమెంటు" అనేది తొమ్మిదో పి20 సమిట్ తాలూకు ఇతివృత్తం గా ఉంది. ఈ కార్యక్రమం లో జి20 సభ్యత్వ దేశాల మరియు ఆహ్వానిత దేశాల పార్లమెంటు ల స్పీకర్ లు పాలుపంచుకోనున్నారు. 2023 సెప్టెంబరు 9 వ -10 వ తేదీ లలో జరిగిన న్యూ ఢిల్లీ జి20 లీడర్స్ సమిట్ లో జి20 యొక్క సభ్యత్వదేశం గా ఆఫ్రికన్ యూనియన్ అయిన తరువాత జరుగుతూ ఉన్నటువంటి ఈ పి20 సమిట్ లో మొట్టమొదటిసారి గా పాన్-ఆఫ్రికన్ పార్లమెంటు పాలుపంచుకోనున్నది.

పి20 సమిట్ కాలం లో నిర్వహించేటటువంటి ఇతివృత్త ప్రధానమైన సదస్సుల లో ఈ క్రింది నాలుగు అంశాల పై శ్రద్ధ వహించ డం జరుగుతుంది. ఆ అంశాలు ఏవేవి అంటే వాటి లో సార్వజనిక డిజిటల్ వేదికల మాధ్యం ద్వారా ప్రజల జీవనం లో మార్పు ను తీసుకు రావడం; మహిళ లు నాయకత్వ స్థానం లో నిలచి ఉండే అభివృద్ధి ని సాధించడం; ఎస్ డి జి స్ ను త్వరిత గతి న అందుకోవడం మరియు స్థిర ప్రాతిపదిక న శక్తి సంబంధి మార్పు ను తీసుకు రావడం వంటివి భాగం గా ఉన్నాయి. ప్రకృతి తో సద్భావన కలిగి ఉంటూ, పచ్చదనాని కి మరియు స్థిర భవిష్యత్తు కు ప్రాధాన్యాన్ని ఇస్తూ తీసుకోదగిన కార్యక్రమం పై చర్చోపచర్చలు చేయడం కోసం 2023 అక్టోబరు 12 వ తేదీ నాడు లైఫ్ స్టయిల్ ఫార్ ఎన్ వైరన్ మంట్ (ఎల్ఐఎఫ్ఇ) అంశం పై శిఖర సమ్మేళనాని కి ముందుగానే ఒక పార్లమెంటరీ ఫోరమ్ ను కూడా నిర్వహించడం జరుగుతుంది.



# ఎన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ ఓటమి తథ్యం : మేడే రాజీవ్ సాగర్

హైదరాబాద్, అక్టోబర్ 13(నేటినిజం ప్రతినిధి) అవినీతికి, స్కాములకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్ నిలుస్తుందని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ దుయ్యబట్టారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా బెంగళూరులోని కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో పట్టుబడ్డ రూ. 42 కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు. కర్ణాటకలో గెలిచి ఆరు మాసాలు గడవక ముందే వసూళ్ల పర్వానికి తెరలేపారని విమర్శించారు. అక్కడ అక్రమంగా సంపాదించిన సొమ్ముతో తెలంగాణలో గెలువాలని చూస్తుందని మండిపడ్డారు.

తెలంగాణలో అసలు కాంగ్రెస్ పార్టీకి స్థానం లేదని అందుకే వేల కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తుందన్నారు. అందులో భాగంగానే అక్కడి బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి అక్కడి నుంచి వేల కోట్లు వసూలు చేసిన డబ్బులను తెలంగాణకు తరలిస్తున్నారని విమర్శించారు. నేడు తెలంగాణ ఎన్నికల కోసం కర్ణాటక నుంచి అక్రమంగా డబ్బు తరలించి దొరికిన కాంగ్రెస్ పార్టీ.. రేపు తెలంగాణలో అధికారంలోకి వస్తే ఇదే తరహాలో ఇతర రాష్ట్ర ఎన్నికల కోసం తెలంగాణ నుంచి అక్రమంగా డబ్బు తరచించడం ఖాయమన్నారు.

కర్ణాటక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి.. ఇతర రాష్ట్రాల ఎన్నికలపై దృష్టి సారించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అసలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులే లేరని, అందుకే ఇంతవరకు ఒక్క అభ్యర్థిని సైతం ప్రకటించలేదని విమర్శించారు. ఆలు లేదు సోలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు అసలు అభ్యర్థులనే ప్రకటించని కాంగ్రెస్ పార్టీలో డజనుకు పైగా నేతలు సీఎం పదవి కోసం పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు.

# బోయిన్‌పల్లిలో విషాదం.. కుటుంబ కలహాలతో తండ్రీ బిడ్డల ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబర్ 13: సికింద్రాబాద్‌లో సిటీలోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోగల భవానీనగర్‌లో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో తండ్రీ ఇద్దరు కుమార్తెలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన బిడ్డలిద్దరికీ నిద్ర మాత్రలు ఇచ్చిన తండ్రి తాను కూడా తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులను తండ్రి శ్రీకాంత్ చారి (42), కుమార్తెలు స్రవంతి (8), శ్రావ్య (7) గా పోలీసులు గుర్తించారు. కాగా కుటుంబసభ్యుల మధ్య ఎలాంటి తగాదాలు లేవని శ్రీకాంత్ చారి భార్య తెలిపింది.

రాత్రి భోజనం తర్వాత అందరం మాట్లాడుకుంటూ పడుకున్నామని, తెల్లారి చూసేసరికి తన భర్త, పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నారని ఆమె చెప్పింది. అదేవిధంగా తమకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని శ్రీకాంత్ చారి తల్లి జయమ్మ తెలిపింది. అయితే ఈ మధ్య శ్రీకాంత్ వ్యాపారం సరిగా నడవడం లేదని జయమ్మ వెల్లడించింది

# హర్యానాకు చెందిన ఏటీఎం దొంగల ముఠా అరెస్ట్



తిరుపతి, అక్టోబర్ 13:అత్యాధునిక పరికరాలతో ఏటీఎం దొంగతనాలకు పాల్పడుతున్న హర్యానా దొంగల ముఠాను తిరుపతి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు తిరుపతిలో శుక్రవారం జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, హర్యానాకు చెందిన దొంగల ముఠా ఏ విధంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు, ఎలా వారిని అరెస్ట్ చేశారో వివరించారు.గత సెప్టెంబర్ 14వతేదీ తిరుపతి రూరల్ ధనలక్ష్మినగర్ లోని ఎస్.బి.ఐ ఏటీఎంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఈ కేసును ఛాలెంజ్ గా తీసుకున్న చంద్రగిరి డి.ఎస్.పి యశ్వంత్ ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ లు బృందాలుగా ఏర్పడి ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో జల్లెడ పట్టినట్టు తెలిపారు. అందులో భాగంగానే ఏటీఎంలో దొంగతనాలు చేస్తున్నది మేవాత్ గ్యాంగ్ గా గుర్తించిన పోలీసులు ఆ దిశగా వేగంగా గాలించారు. దీంతో హర్యానాకు చెందిన ఏటీఎం దొంగల ముఠాలోని ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు, రెండు లారీలు, ఓ కారు, రెండు నాటు తుపాకులు, 21 కేజీల గంజాయి, గ్యాస్ కట్టర్స్ పరికరాలు, రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

మేవాత్ గ్యాంగ్ పై ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో 19 కేసులున్నాయని, ముఠాలో ప్రధాన ముద్దాయి సద్దాంఖాన్ పై వివిధ రాష్ట్రాల్లో 23 కేసులు నమోదయినట్టు తెలిపారు. ఏటీఎం దొంగతనాలతో పాటు గంజాయిని కూడా ఈ ముఠా విక్రయించేదని, అది కూడా ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తక్కువ రేటుకు కొనుగోలు చేసి హర్యానా రాష్ట్రంలో ఎక్కువ రేట్లకు విక్రయించేవారని తెలిపారు. ఈ ముఠాలోని ఇద్దరు సభ్యులు రహాడి సద్దాం, అమీర్ ఖాన్ లు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ ధీమా వ్యక్తం చేశారు. ఏటీఎం అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులైన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న తిరుపతి రూరల్ పోలీసులకు రివార్డులు అందజేసినట్టు ఎస్పీ తెలిపారు.

# బదిలీలు సర్వ సాధారణం.. అవకాశమొస్తే మళ్లీ వరంగల్‌కు వస్తా.. సీపీ రంగనాథ్



వరంగల్, అక్టోబర్ 13:బదిలీలు సర్వ సాధారణమని, అవకాశమొస్తే మళ్లీ వరంగల్ కు వస్తానని సీపీ రంగనాథ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బదిలీపై వెళ్తున్న సీపీ రంగనాథ్ మీడియాతో భావోద్వేగంతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమన్నారు. కానీ వరంగల్ లో ప్రజలతో, మీడియాతో చాలా సింక్ అయినానన్నారు. ఇక్కడ చాలా సమస్యలు ఉన్నాయి.. వాటివల్ల తాను ప్రజలకు దగ్గర అయిన ఐడియాలజీతో పోలీస్ పని ఇలా ఉంది.. బలహీనంగా ఉన్న వాడిని బలవంతుడి నుండి కాపాడాల్సిన బాధ్యత పోలీసులకు లాండ్ ఆర్డర్ ఉందన్నారు. అన్యాయంగా ఉంటే న్యాయం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉదయం 7గంటల నుండి రాత్రి 11గంటల వరకు ప్రజల సమస్యలు, అధికారులతో ఫోన్ మాట్లాడిన సందర్భం ఉందన్నారు.

ఇంకా ఆయన ఏమన్నారంటే.. “తాను మాభూమి సినిమా చిన్నప్పుడు చూసాను.. కానీ ఇక్కడ నిజ జీవితంలో భూ సమస్యలు చూసానన్నారు. ఇక్కడ ఉన్న అధికారులు సపోర్ట్ గా ఉన్నారన్నారు. విద్యార్థులు సమస్యను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్ళను.భూ సమస్యలు చాలా బాధాకరం.అలాంటి వాటిని సమస్య, ఎమోషనల్ ని చూడాలి..వరంగల్ మీడియా చాలా సపోర్ట్ గా ఉన్నారు.అన్యాయం ను ఎదురించాలి. అధికారులు కొంత తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలి.

పవర్ ఉందని చేస్తే ఇబ్బందులు ఉంటాయి.. ప్రతివారికీ చెక్కు పెట్టాలి..లేదంటే మనం ఇబ్బందులు ఎదుర్కొంటాం.. అందరం ఒకటే..వరంగల్ పని చేసినందుకు చాలా సంతోషంగా ఉన్నాను. పలువురు నేతలు తనకు సపోర్ట్ చేశారు. ఎక్కడైనా తప్పుడు కేసులు పెడితే నేను సహించాను..మర్డర్ కేసులో తప్పు చేయని వారికి శిక్ష పడితే పరిస్థితి ఏంటి. నాకు అవకాశం వస్తే ఇక్కడకు రావాలని అనుకుంటున్నాను. ప్రజల కోసం పనిచేయాలని అనుకుంటున్నా.. నేను ఎక్కువ ఎవరితో ఇంట్రాక్ట్ కాలేదు.. మీరు హైదరాబాద్ వస్తే కలువొచ్చు.. మీకు ఏదైనా సమస్య ఉంటే న్యాయం ఉంటే కచ్చితంగా సహాయం చేస్తాను” అంటూ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఇంచార్జి మురళీధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి, సదయ్య, ట్రెజరేర్ బొల్లా అమర్, సీనియర్ జర్నలిస్ట్ 143 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, సీనియర్ జర్నలిస్ట్ దాసరి కృష్ణ రెడ్డి, టీయూడబ్యూ రాష్ట్ర నాయకులు మధు, కార్యవర్గం మీడియా ప్రతినిధులు, హనుమకొండ ఏసీపీ కిరణ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సెంచరీ.. సర్కారు ఖాయం



హైదరాబాద్, అక్టోబర్ 13:మేడ్చల్‌లో ఈ నెల 18న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వి కన్వేషన్ సమీపంలో జరుగనున్న సభా స్థలి ఏర్పాట్లను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. సుమారు 50 ఎకరాల స్థలంలో నిర్వహిస్తున్న సభకు సుమారు 60వేల పైచిలుకు ప్రజలను తరలించే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.రానున్న శాసనసభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సెంచరీ కొట్టడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం ఖాయమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అంటే ప్రజలకు ఇంటి పార్టీగా మార్చుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారని, వాళ్లకు ఓట్లు వేస్తే రాష్ట్రం అదోగతి పాలవుతుందని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్‌కు ఏం చేశారని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి బీఆర్ఎస్ ఇస్తున్న అన్ని పథకాలను నిలిపివేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, తూకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్, మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్‌యాదవ్, శేఖర్‌గౌడ్, మల్లికార్జునస్వామి, భాగ్యారెడ్డి, సర్పంచులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# “కౌశల్ దీక్షాంత్ సమారోహ్ అనేది వర్తమాన భారతదేశం యొక్క ప్రాధాన్యాలకు అద్దం పడుతున్నది”-ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13:సభికులను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, నైపుణ్యాభివృద్ధి తాలూకు ఈ వేడుక అద్వితీయమైనటువంటిది గా ఉంది, అంతేకాదు దేశవ్యాప్తంగా విస్తరించిన నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త స్నాతకోత్సవం ఘట్టం ఎంతో ప్రశంసనీయమైనటువంటి కార్యక్రమం గా కూడా ఉంది అంటూ అభివర్ణించారు. కౌశల్ దీక్షాంత్ సమారోహ్ వర్తమాన భారతదేశం యొక్క ప్రాధాన్యాల ను ప్రతిబింబిస్తున్నది అని ఆయన అన్నారు. వేల కొద్దీ యువతీయువకులు సాంకేతిక విజ్ఞానం మాధ్యం ద్వారా ఈ కార్యక్రమం తో జత పడడాన్ని ప్రధాన మంత్రి గుర్తించి, వారందరికి తన తరఫున శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు.

ఏదైనా దేశం లో ఆ దేశాని కి చెందిన ప్రాకృతిక వనరులు గాని, లేదా ఖనిజ సంబంధి వనరులు గాని, లేదా ఆ దేశాని కి చెందిన సుదీర్ఘమైన కోస్తా తీర ప్రాంతాల వంటి బలాల ను వినియోగించుకోవడం లో యువ శక్తి కి ప్రాముఖ్యం ఉంటుందని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. బలమైన యువశక్తి అండతో దేశం మరింతగా అభివృద్ధి చెందుతుంది, తద్వారా దేశం యొక్క వనరుల కు న్యాయం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఇదే రీతి న నడుస్తున్న ఆలోచన లు భారతదేశం యొక్క యువత కు సాధికారిత ను కల్పిస్తున్నాయి. తత్ఫలితం గా యావత్తు ఇకోసిస్టమ్ లో ఇదివరకు ఎన్నడూ ఎరుగనంతటి మెరుగుదల లు చోటు చేసుకొంటున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ‘‘ఈ విషయం లో భారతదేశం యొక్క వైఖరి రెండు విధాలైంది గా ఉంది” అని ప్రధాన మంత్రి చెప్పారు. భారతదేశం దాదాపు గా నాలుగు దశాబ్దాల కాలం అనంతరం క్రొత్త జాతీయ విద్య విధానాన్ని తీసుకు వచ్చింది. భారతదేశం విద్య మరియు నైపుణ్యాల ద్వారా తన యువత నూతన అవకాశాల తాలూకు ప్రయోజనాన్ని పొందేటట్లుగా వారిని సన్నద్ధుల ను చేస్తున్నది అని ఆయన వివరించారు. ప్రభుత్వం పెద్ద సంఖ్య క్రొత్త వైద్య కళాశాలల ను మరియు ఐఐటి లు, ఐఐఎమ్ లు, లేదా ఐటిఐ లు వంటి నైపుణ్య అభివృద్ధి సంస్థల ను ఏర్పాటు చేస్తోంది అని కూడా ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. ‘ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన’ లో భాగం గా కోట్ల కొద్దీ యువతీ యువకులు శిక్షణ ను అందుకొన్నారు అని ఆయన ప్రస్తావించారు. మరో ప్రక్క ఉద్యోగాల ను కల్పిస్తున్నటువంటి సాంప్రదాయక రంగాల ను కూడా బలపరచడం జరుగుతున్నది. అలాగే, ఉపాధి ని ప్రోత్సహించేటటువంటి మరియు నవ పారిశ్రామికత్వాన్ని ప్రోత్సహించేటటువంటి క్రొత్త రంగాల ను సైతం ప్రోత్సహించడం జరుగుతున్నది అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. వస్తువుల ఎగుమతుల లో, మొబైల్ ఎగుమతుల లో, ఎలక్ట్రానిక్ సంబంధి ఎగుమతుల లో, సేవల సంబంధి ఎగుమతుల లో, రక్షణ సంబంధి ఎగుమతుల లో మరియు తయారీ లో భారతదేశం నరిక్రొత్త మైలు రాళ్ళ ను చేరుకొంటోంది అని కూడా ప్రధాన మంత్రి అన్నారు;

అదే కాలం లో అంతరిక్షం, స్టార్ట్-అప్స్, డ్రోన్స్, ఏనిమేశన్, విద్యుత్తు వాహనాలు, సెమీ కండక్టర్స్ మొదలైనటువంటి అనేక రంగాల లో యువత కు క్రొత్త క్రొత్త అవకాశాల ను పెద్ద సంఖ్య లో కల్పించడం జరుగుతోంది అని ఆయన అన్నారు.

“ప్రస్తుతం యావత్తు ప్రపంచాని కి ఈ శతాబ్దం భారతదేశం యొక్క శతాబ్దం గా కాబోతోంది అనే నమ్మకం ఉంది” అని ప్రధాన మంత్రి అన్నారు. దీని ఖ్యాతి భారతదేశం యొక్క యువ జనాభా దే అని ఆయన అన్నారు. ప్రపంచం లో అనేక దేశాల లో పెద్ద వయస్సు కలిగిన వ్యక్తుల సంఖ్య పెరుగుతూ ఉన్న కాలం లో భారతదేశం నానాటికీ యవ్వన భరితం గా మారుతున్నది అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. “భారతదేశాని కి ఈ విధమైన భారీ ప్రయోజనం ఉంది” అని ఆయన నొక్కి చెప్పారు. ప్రపంచం భారతదేశం లోని నైపుణ్యవంతులైన యువత కేసి చూస్తోంది అని ఆయన అన్నారు. గ్లోబల్ స్కిల్ మేపింగ్ విషయం లో భారతదేశం చేసిన ప్రతిపాదన ను ఇటీవల జరిగిన జి20 శిఖర సమ్మేళనం లో ఆమోదించడమైంది అని ఆయన వెల్లడించారు. ఇది రాబోయే కాలాల్లో యువత కు ఉత్తమమైనటువంటి అవకాశాల ను కల్పించడం లో సహాయకారి అవుతుంది అని ఆయన చెప్పారు. అందివస్తున్నటువంటి ఏ ఒక్క అవకాశాన్ని వృథా పోనీయకండి అని ప్రధాన మంత్రి సూచించారు. ఈ విషయం లో మద్దతు ను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం గా ఉంది అంటూ ఆయన హామీ ని ఇచ్చారు. మునుపటి ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి విషయం లో అజాగ్రత వహించాయి అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. “మా ప్రభుత్వం నైపుణ్యాని కి ఉన్నటువంటి ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకొని, దానికోసమంటూ ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ ను ఏర్పరచడం తో పాటు గా ఒక ప్రత్యేక బడ్జెటు ను కేటాయించింది” అని ఆయన అన్నారు. భారతదేశం ఇదివరకటి కంటే ఎక్కువగా తన యువత యొక్క నైపుణ్యాల పై మరింత గా పెట్టుబడి పెడుతోంది అని ఆయన స్పష్టంచేశారు. ఈ సందర్భం లో ‘ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన’ ను గురించి ఒక ఉదాహరణ గా ఆయన చెప్తూ, ఆ పథకం క్షేత్ర స్థాయి లో యువత ను బలోపేతం చేసింది అన్నారు. ఈ పథకం లో భాగం గా దాదాపు గా ఒకటిన్నర కోట్ల మంది యువతీ యువకుల కు ఇంతవరకు శిక్షణ ను ఇవ్వడం జరిగింది అని ప్రధాన మంత్రి తెలిపారు. ఇండస్ట్రియల్ క్లస్టర్స్ సమీపం లో క్రొత్త నైపుణ్య కేంద్రాల ను కూడా ఏర్పాటు చేయడం జరుగుతున్నది. వీటి వల్ల పరిశ్రమ కు తన అవసరాల ను నైపుణ్య అభివృద్ధి సంస్థల కు వెల్లడించేందుకు వీలు చిక్కుతుంది. అదే జరిగిన నాడు సదరు నైపుణ్యాల ను యువత లో అభివృద్ధి పరచడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అని ఆయన వివరించారు.

నైపుణ్యాల ను అలవరచుకోవడం, నైపుణ్యాల స్థాయి ని పెంపు చేసుకోవడం, ఇంకా రి-స్కిలింగ్ లకు గల ప్రాముఖ్యాన్ని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావిస్తూ, ఉద్యోగాల సంబంధి స్వభావం మరియు ఉద్యోగాల తాలూకు అవసరాలు శరవేగం గా మారిపోతున్నాయన్నారు. ఆ మార్పుల కు అనుగుణం గా నైపుణ్యాల ను ఉన్నతీకరించుకోవలసిన అవసరం ఉందని స్పష్టంచేశారు.

ఈ కారణం గా పరిశ్రమ, పరిశోధన మరియు నైపుణ్య అభివృద్ధి సంస్థ లు వర్తమాన కాలాని కి తగినట్లుగా రూపొందడం చాలా ముఖ్యం అని ప్రధాన మంత్రి అన్నారు. నైపుణ్యాల పట్ల శ్రద్ధ అధికం అయింది అని ప్రధాన మంత్రి చెప్తూ, గడచిన తొమ్మిది సంవత్సరాల లో దేశం లో సుమారు గా అయిదు వేల క్రొత్త ఐటిఐ లను స్థాపించి, నాలుగు లక్షల కు పైగా ఐటిఐ సీట్ లను జోడించడమైందన్నారు. ఆ సంస్థల ను సమర్థమైన మరియు ఉత్తమమైన అభ్యాసాల తో పాటు అధిక నాణ్యత కలిగిన శిక్షణ ను ఇచ్చే మాడల్ ఐటిఐ లుగా ఉన్నతీకరించే ప్రక్రియ కొనసాగుతోంది అని కూడా ఆయన అన్నారు.

“భారతదేశం లో నైపుణ్యాభివృద్ధి తాలూకు పరిధి నిరంతరం గా వృద్ధి చెందుతున్నది. మనం మెకానిక్ లు, ఇంజినీర్ లు, సాంకేతిక విజ్ఞానం లేదా మరేదైనా సేవల కు మాత్రమే పరిమితం అయిపోలేదు” అని ప్రధాన మంత్రి అన్నారు. మహిళల స్వయం సేవ సమూహాల ను డ్రోన్ టెక్నాలజీ ని వినియోగించుకోవడాని కి సన్నద్ధం చేయడం జరుగుతోంది అని ఆయన అన్నారు. మన నిత్య జీవనం లో విశ్వకర్మ లకు ఉన్న ప్రాముఖ్యాన్ని గురించి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేస్తూ, పిఎమ్ విశ్వకర్మ యోజన అనేది విశ్వకర్మ లకు వారి సాంప్రదాయక నైపుణ్యాల ను ఆధునిక సాంకేతిక విజ్ఞానం తో, ఆధునిక ఉపకరణాల తో జతపరచుకొనే సామర్థ్యాన్ని అందిస్తుందని వివరించారు.

భారతదేశం యొక్క ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తూ ఉన్న క్రమం లో యువత కోసం సరిక్రొత్త అవకాశాల ను కల్పించడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి తెలిపారు.

భారతదేశం లో ఉద్యోగ కల్పన ఒక క్రొత్త శిఖర స్థాయి ని చేరుకొంది. మరి ఇటీవలి ఒక సర్వే ప్రకారం భారతదేశం లో నిరుద్యోగం రేటు ఆరు సంవత్సరాల కాలం లో అత్యంత తక్కువ స్థాయి లో ఉంది అని ఆయన చెప్పారు. భారతదేశం లో పట్టణ ప్రాంతాల లో మరియు గ్రామీణ ప్రాంతాల లో నిరుద్యోగం చాలా వేగం గా తగ్గుతోందని ప్రధాన మంత్రి చెప్తూ, అభివృద్ధి తాలూకు ప్రయోజనాలు నగరాల కు మరియు పల్లెల కు సమానం గా అందుతున్నాయి అని నొక్కి పలికారు. దీని ఫలితం గా నగరాల లోను, గ్రామాల లోను క్రొత్త అవకాశాలు సమానం గా వృద్ధి చెందుతున్నాయని ఆయన అన్నారు. భారతదేశం యొక్క శ్రమ శక్తి లో మహిళల భాగస్వామ్యం ఇదివరకు ఎన్నడూ లేని స్థాయి లో అధికం అయింది అని ఆయన చెప్పారు. ఈ ప్రభావం యొక్క ఖ్యాతి గడచిన కొన్నేళ్ళ లో మహిళల సశక్తీకరణ కు సంబంధించి భారతదేశం లో ప్రవేశపెట్టిన పథకాలు మరియు ప్రచార ఉద్యమాల దే అని ఆయన అన్నారు.

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) విడుదల చేసిన ఇటీవలి సంఖ్యల ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటిస్తూ, భారతదేశం రాబోయే సంవత్సరాల లో అత్యంత వేగం గా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ గా కొనసాగుతుంది అన్నారు. భారతదేశాన్ని ప్రపంచం లోని అగ్రగామి మూడు ఆర్థిక వ్యవస్థల లో ఒక ఆర్థిక వ్యవస్థ గా నిలపాలన్న తన సంకల్పాన్ని కూడా ఆయన మరొక్క మారు గుర్తు కు తీసుకు వచ్చారు. ఐఎమ్ఎఫ్ కూడా రాబోయే మూడు నాలుగు సంవత్సరాల లో భారతదేశం ప్రపంచం లోని అగ్రగామి మూడు ఆర్థిక వ్యవస్థల లో ఒక ఆర్థిక వ్యవస్థ గా రూపొందగలుగుతుందన్న విశ్వాసం తో ఉంది అని ఆయన అన్నారు. అదే జరిగిందంటే గనక దేశం లో ఉపాధి సంబంధి మరియు స్వతంత్రోపాధి సంబంధి నూతన అవకాశాలు ఏర్పడుతాయఅని ఆయన స్పష్టం చేశారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగం చివర లో, స్మార్ట్ మరియు స్కిల్ డ్ మేన్ పవర్ సొల్యూశన్స్ ను అందించాలి అంటే ప్రపంచం లో భారతదేశాన్ని నైపుణ్యం కలిగిన సిబ్బంది తాలూకు అతి పెద్ద కేంద్రం గా తీర్చిదిద్దవలసిన అవసరం ఉంది అని స్పష్టం చేశారు.

“నేర్చుకోవడం, బోధించడం లతో పాటు ముందంజ వేయడం అనే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉండాలి. జీవనం లో అడుగడుగునా మీరు సఫలం అవుదురు గాక” అంటూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



నల్లగొండ,, అక్టోబర్ 13: బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా కేతపల్లి మండలం కొండకింది గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు.

పార్టీలో చేరిన వారిలో నర్సింగ్ నాగయ్య, టంగుటూరి రవి, టంగుతురి శ్రీను, బెజవాడ వెంకన్న, బెజవాడ బుచ్చయ్య, నర్సింగ్ భిక్షమయ్య నర్సింగ్ సైదులు, గరిక వెంకన్న, నర్సింగ్ సతీష్, రాచకొండ సైదులు, బెజవాడ లింగయ్య, పెద్ది నాగులు, పోగుల నాగయ్య, పుట్ట సైదులు, తదితరులున్నరు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మారం వెంకట్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, బంటు మహేందర్, బొప్పని సురేష్, బొజ్జ అరవింద్, సర్పంచ్ గోలి మంజుల వేణు మాధవ రెడ్డి, ఉప సర్పంచ్ పెరిక ప్రభాకర్, తదతరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా

హైదరాబాద్, అక్టోబర్ 13(నేటినిజం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేస్తుందని, బజారులో గొడ్డను అమ్ముకున్నట్టు టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతానికి భిన్నంగా వ్యక్తి స్వామ్యం నడుస్తుందని, ఉదయ్ పూర్ డిక్లరేషన్ అమలు చేసే పరిస్థితి లేదని లేఖలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి భూమి పుత్రులుగా ఉన్న వాళ్లక అవమానాలు, కొత్తగా వచ్చిన వాళ్లకు పెద్దపీట వేస్తూ పాత వాళ్లు ఉనికి కోల్పోయేలా చేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం పార్టీ అంశాలు కూడా చర్చించేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ టికెట్ విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న పొన్నాల రాజీనామా అనంతరం ఎవరికి అందుబాటులో లేకుండా పోయారు.




